# తోడొక రుండిన...

-శ్రీమతి హరిప్రియ

సముద్రపు ఒడ్డునే కూర్చుని పాదాలు నీటిలో ముంచి ఉధృతంగా దూకుతూ వస్తోన్న కెరటాల్నీ, నిశ్శబ్దంగా, గంభీరంగా, నిండు గర్భిణిలా నిదానంగా నడచినట్లువస్తోన్న అలన్నీ తదేకదృష్టితో చూస్తూ చేతికి దొరికిన చిన్న చిన్న గవ్వల్నీ, వాటితోపాటు చేతికి వచ్చేతడి ఇసుక ముద్దల్నీ కెరటాలమీదికి విసురుతూ ఆలోచిస్తున్నాడు అభినవ్.



సముద్రంలో రేగుతున్న అల్లకల్లోలం చెదిరిపోతోంది గానీ అతని మనసులో చెలరేగే కల్లోలం శాంతించటం లేదని అతని నిశ్చలదృష్టే నిరూపిస్తోంది.

మాసినగడ్డం, పెరిగిన క్రాఫ్, నలిగి మురిగ్గా ఉన్న బట్టలూ, వాటి వెనుక లో లోపల పిడికెడంత గుండెలో ఎడతెగని ఆకాశమంతటి ఆలోచనా సముద్రం! మిట్ట మధ్యాహ్నం దాటుతున్నా టెంపరేచర్ చల్లటి వాతావరణాన్ని తగ్గించలేదు.

ఉధృతమైన చలి నరాలను సైతం ఒణికించేస్తోంది. తెల్లదుప్పటి మీదపడుతోన్నట్లుగా ఉంది మంచు.

సముద్రపు హోరుతోపాటు డాక్టర్ మల్హోత్రా చెప్పిన మాటలు మళ్ళీ మళ్ళీ రిపీటవుతున్నాయి బ్రెయిన్‌లో.

"మిస్టర్ అభినవ్! నీ కిడ్నీలు రెండూ చెడిపోయాయని రిపోర్టుల్లో తేలింది. దానికి ఒకే ఒక దారి ట్రాన్స్‌ప్లాన్‌టేషన్! ఈ స్థితిలో మేం చెయ్యగలిగిన దానికంటే నువ్వు ఏర్పాటు చేసుకోవలసిందే ఎక్కువుంది. ఇది జరగాలంటే రెండు కావాలి. ఒకటి నీకు కిడ్నీ ఇచ్చేవాడు...రెండు... లక్షల్లో కావలసిన డబ్బు! ఎలాగోలా ఇవి ఎరేంజ్ చేసుకున్నావంటే నిన్ను బ్రతికించే ఎరేంజ్‌మెంట్ నేను చేస్తాను."

అంత బాధలోనూ నవ్వొచ్చింది అభినవ్‌కి.

కిడ్నీ, కరెన్సీ రెండూ ఉంటే బ్రతికే ఏర్పాటు చేస్తాడట! కబేళాలో మాంసం ముక్కలు కొనుక్కున్నంత తేలిగ్గా చెప్పాడు.

జనరల్ స్టోర్‌లో కనీసం సరుకులు కూడా అప్పు పుట్టించే కెపాసిటీ తనకు లేదే?! స్థిర చరాస్తులు ముందే లేవు!



అమ్మకి వచ్చే సాధారణ వ్యాధులకే మందులిప్పించే స్తోమత లేదు. అలాంటిది... తన లాంటి అసహాయుడికి... బ్రతికే అర్హత కూడా లేదేమో! బ్రతుకు మీద ఆశనూ, తీపినీ చంపుకోవటానికి కూడా వయసు కాదు. నిండా పాతిక దాటలేదు. ఎప్పుడో కాలేజీ జ్ఞాపకాలు గుర్తొచ్చాయి.

"జనన మరణాలు నాణేనికి ఇరుపక్కలా ఉండే బొమ్మా బొరుసుల్లాంటివి. పుట్టుక అనేది చావుతోనే ముడిపడి ఉంది. అసలు పుట్టుకే చావుకు చేసుకున్న గొప్ప అరేంజ్‌మెంట్." డబ్బున్న గొప్ప గొప్పోళ్ళు డబ్బు వెదజల్లి ఆయుర్దాయాన్ని కొంతపెంచుకోగలరు.

అసలు మరణాన్ని ఆపలేకపోయినా తనలాంటి దిగువక్లాసు మనుషుల విషయంలో మాత్రం ఇది పచ్చి నిజం అని తన పరిస్థితే ఋజువు చేస్తోంది.

కానీ తను బ్రతకాలి. తనకోసం కాదు... తను పిచ్చిగా ప్రేమించిన తన మాధురి కోసం... తను తప్పక బ్రతకాలి." ఉద్వేగంతోనో, ఆనందంతోనో అపుడే ఉబికి వచ్చిందో కన్నీటి బొట్టు. గుండెను పిండే బాధ దుఃఖంలా వచ్చి గుండె తలుపు తట్టగానే మౌనంగా పరుగులిడుతూ విచ్చేసి మోడు బారిన నయన సీమను సజలం చేసి, ఓదార్పు గంధాలు పూసి అంతలోనే ఈ లోకంతో పని ముగిసినట్లు కంటి కనుమల కొసలనుండి దూకి శాశ్వతంగా సెలవు తీసుకుంటుంది.

అదొక వింతైన అతిథి! శరీరాన్ని ఒణికించే చలికూడా సెగ్గలా తాకి మనసుకి చిరుచెమట పట్టించింది. మూడు రోజులుగా ఇదే పరిస్థితి!

ఏదో పని ఉందని మాధురి తన తాతగారి ఊరు వెళ్ళి రాలేదు. ఆమె రావాలి! తన పరిస్థితంతా చెప్పుకుని తన బాధంతా వెళ్ళగ్రక్కాలి! అప్పుడు తనలోని ఈ సెగలూ, పొగలూ చల్లబడాలి! ఔనుమరి - ప్రేమించిన మనసుకు తెలిసిందొక్కటే! అదే నమ్మకం!

సరిగ్గా అప్పుడే తాకాయి నాజూకైన వేళ్ళు.

తిరిగి చూస్తే... మాధురి!

"హల్లో అభినవ్! ఏమిటీ... నాకోసం చాలాసార్లు ఫోన్ చేశావట. నేను లేనని తెలిసికూడా చేశావు? విరహవేదనా?! ఐనా ఇక్కడ ఉండీ నీకు కనిపించనని ఎందుకనుకున్నావు? సాగరతీరానికే రమ్మనికూడా చెప్పావట? నామీద నీకు నమ్మకం లేదా? లేక నమ్మకం పోతోందా? త్వరగా చెప్పకపోతే చంపేస్తా." తేనెభాండం లాంటి నోటినుండి కెరటాల్లా గలగలా దూకుతోన్న మాటలు.

ఆ కదలికలకి తళుక్కుమంటున్న పగడా ల్లాంటి పెదవులు. అంత బాధలోనూ, మానసిక వేడిలోనూ, హిమవన్నగపు టంచులు తాకినట్లు, మనసును మంచు ముక్క స్పృశించినట్లూ చల్లనై ఆశల లోకాలకి లాక్కెళ్ళింది.

తన నమ్మకం సరైనదే! లక్ష్మీమానస పుత్రిక: తనను తప్పక రక్షించుకుంటుంది....తన కోసమైనా తనని తప్పక రక్షించుకుంటుంది!! ఆనందాన్ని తెచ్చుకుంటూ నవ్వి...

"మునగ బోతోన్న వాణ్ని కదా? సముద్రపు ఒడ్డైతే అనుకూలంగా ఉంటుందనీ." తన భుజాల మీదున్న ఆమె రెండు చేతుల్నీ పట్టుకుని తలను వెనక్కివిరిచి ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"ప్రేమలో నిండా మునిగిన వాళ్ళం ఇంకా మునిగేదేముంది?" వెనక నుండే రెండు చేతుల్తో అతని మెడని చుట్టేసి తన తలను అతని మెడ వంపులో ఇరికిస్తూ అల్లరిగా అంది.

తను ప్రేమించిన అమ్మాయి!

తనను ప్రేమించిన అమ్మాయి!!

తను చెప్పబోయేది విని తట్టుకోగలుగుతుందా? అనేది తన సంశయమైనా చెప్పక తప్పదు.

మనసులో రగులుతున్న బాధని ఆమెకు చెప్పుకుంటేనే గానీ తీరదు. అదే కాదు. పరిష్కారం కూడా దొరుకుతుంది.

పరస్పరం ప్రేమించుకున్న మనిషికి చెప్పుకుంటే బాధ అడుగంటి పోతూంది కూడా.

"ఏయ్! ఏమిటీ తపస్సు..." తన పగడాల్లాంటి పెదాల్ని నేరుగా రుద్దుతూంటే ఆ స్పర్శ అతనిలో ఏవేవో సరాగాలు పలికిస్తోంది.

"కొంపదీసి ఇంకెవర్నైనా ప్రేమించావా?"

"ఔను మాధురీ!... ఇంకొకర్ని ప్రేమించాను." కావాలనే టీజ్ చేశాడు.

"ఆ...ఎవర్నీ..." ఒక్కసారిగా అతన్ని వదిలి గయ్యిమంది.

"నిజం మాధురీ! నేను...నా జీవితాన్ని ప్రేమించాను... నువ్వేగా నా జీవితం?!"

సుడిగాలిలా అతని ఒళ్ళో వాలి పకపకా నవ్వేసింది.

"కానీ..."

"ఇప్పుడు కానీల్లేవు. అన్నీ పైసలే." అతని ముఖాన్ని మీదికి లాక్కుంటూ అంది.

"పూర్తిగా విను మాధురీ."

"చెప్పు."

శరీరం ఆత్రంగా స్పృశిస్తోంటే మనసు ఆరాటపడుతోంది.

"నాకంటే ముందు... మృత్యువు నన్ను ప్రేమిస్తోందని తెలిసి... దారుణంగా ఓడిపోయాను."

విషాదాంతమని తెలిసీ కథ ప్రారంభించటం కన్నా బాధాకరమైనది మరొకటి లేదేమో! తనని పాముని విదిలించుకున్నట్లు వదిలి విభ్రమంగా చూస్తోంది.


"ఔను మాధురీ..." అంతా చెప్పేశాడు. నిస్తేజంగా సూన్యంలోకి చూస్తూ అంతా వింది.

మాధురి తనను అమాయకంగా ప్రేమిస్తోంది. నిజాన్ని దాచి మోసం చెయ్యటం ఇష్టంలేక నిజాయితీగా అంతా క్షుణ్ణంగా చెప్పేశాడు. అంతా విని నిశ్శబ్దంగా మారిపోయింది మాధురి.

ఇద్దర్లో ఎవరికీ మాటలు రావటం లేదు. ఒడ్డుని తాకిన కెరటాల సవ్వడి మాత్రం సముద్రపు గుండెల్ని తడుతోంది.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఏ క్షణాన తనను చుట్టుకుపోయి బావురుమంటూ "అభీ! నిన్ను నేను రక్షించు కుంటాను. నీకు నేనున్నాను." అంటుందనేలా ఉంది. కానీ నిర్వేదంతో మనసు గడ్డ కట్టిందేమో! అందుకే... తనే గొంతు విప్పాడు.

"బాధపడుతున్నావా మాధురీ?... నిన్ను బాధ



డి. శ్రీధర్, కొండాపురం. మం: రాయదుర్గ, జిల్లా: అనంతపూర్.

పెట్టానా?" ఆ క్షణాన్నే ఆమె ఒడిలో తలదూర్చి ఈ లోకాన్నే మరచి పోవాలన్నంత ఆశని కళ్ళల్లో నింపుకుని జాలిగా అన్నాడు.

"కానీ..."

చివాల్నలేచి వెనక్కి తిరుగుతూ అంది.

"కొన్ని నిజాలు బాధకలిగించినా ముందే తెలిసి రావటం ఒక విధంగా అదృష్టమే అభీ."

ఆమె గొంతులోకి గాంభీర్యం అతన్ని ఆశ్చర్యంలో ముంచింది.

"మా.... ధు...రీ?!!!"

"ఔను అభీ! ఇదే మన పెళ్ళయ్యాక జరిగి ఉంటే నా గతి ఏమయ్యేదో, ఎంత ఘోరంగా ఉండేదో ఊహించు కుంటేనే భయం వేస్తోంది."

ఉండేలు దెబ్బతిన్న పక్షిలా గిలగిల లాడిపోయాడు. తన నిశ్శబ్దంలోని భావం ఇదా?! తను విన్నదినమ్మలేనట్లూ, నమ్మకం కలగనట్లూ ఆమెవైపు చూశాడు.

ఈ విషయం వినగానే తన ఆరోగ్యం గురించి తల్లడిల్లి పోతుందనుకున్నాడు. కానీ... మాధురి ఎంత దూరం ఆలోచించిందంటే... తమ ప్రేమ పెళ్ళిగా ముడిపడి, ఆ తరువాత తనను వదిలి అభినవ్ చనిపోయే దాకా. రంపంతో గుండెను చీల్చినట్లయింది. మళ్ళీ తనే అంది.

"నా మాటలు నీకు చేదుగా అనిపించొచ్చు అభీ! కానీ ఆ చేదుని జీవితమంతా అనుభవించటానికి నేను సిద్ధంగా లేను. నేను నిన్ను ప్రేమించాను నిజమే! నాకు నీమీద ప్రేమ ఉంది. జాలి ఉంది... సిన్సియర్‌గా చెప్పాలంటే ప్రేమను త్యాగం చేయాలన్న తపన నాకు లేదు. కష్టంలో కలసి ఉండలేదని కోపం తెచ్చుకోకు. నీకు తెలుసుగా? నాకు ప్రేమంటే ఎంత ప్రేమో కష్టా లంటే కూడా అంతే భయమని?"

దూరంగా ఎక్కడో పిడుగుపడిన శబ్దం.

నల్లనిమేఘాన్ని కప్పుకుని కన్నీటి వర్షంతో రోదించ టానికి సిద్ధంగా ఉంది ఆకాశం. జీవితాన్ని మింగేసిన చీకటి దట్టంగా అలుముకుంది. నిరంతరం శాసించే కళ్ళు శపించినప్పుడు కలిగే నిర్వేద స్థితి. ఇద్దరి మధ్యా నిశ్శబ్దంగా జారుతూన్న ఇనుప తెర.

ఒకరినొకరు అప్యాయంగా అక్కున జేర్చుకుని గుండె ల్లో తలదూర్చి ఆకాశపు వెలుగు చీకట్లనీ, వర్షపు హోరునీ, తడిసిన సూర్యబింబాన్నీ ధిక్కరిస్తూ గడిపిన ప్రాతః కాలా లూ, సాయంసంధ్యల జ్ఞాపకాల మాలికలూ తెగి చెల్లాచెదురుగా పడుతోన్న అనుభూతి! రక్తనాళాలు తెగినంత బాధ గుండెల్లో. డబ్బులేకపోతే ప్రాణాలొక్కటే నిలవవనుకున్నాడింత వరకూ. ఊఁ ఊఁ... ప్రాణాలే కాదు. ప్రేమ కూడా నిలవదు అని మాధురి నిరూపించింది.

ఔను... దానికి తిరుగులేదు. ఈ కాసేపటిలోనే మాధురిలో ఎంత మార్పు?"

"మనిద్దరం ఒక్కటి. మనల్ని ఎవ్వరూ విడదీయ లేరు" అని చెప్పిన నోటితోనే...

"నేను ప్రేమించాలంటే నీకు ఆరోగ్యం, చెదరని అందం, సంపాదించగలిగే సామర్థ్యం కలిగిన భవిష్యత్తు కావాలి" అని ఎంత తియ్యగా చెప్పింది?

ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ వాల్యూస్! కరుణలోంచి కాఠి న్యంలోకీ, గుండెలకి మత్తుగా హత్తుకోవడంలోంచి గుం భనంగా వదిలించుకోవడంలోకీ, ప్రేమలూ, బంధాలూ, అనుబంధాలూ... అన్నింటినీ తుడిచిపెట్టేయగల శక్తి ఒక్కడబ్బుకే ఉందన్న నగ్న సత్యం ఆమె మాటల్లో దొర్లింది.

ఎదుటివాడు విషాదంతో మరణించినా తను ఆనందంగా బ్రతకాలి అన్నదొక్కటే అంతిమ సత్యం అనే ఫిలాసఫీ ఆమె అభిప్రాయంలో పొర్లింది.

యస్! మనుషుల్ని శాశించేది ఆ దేవుడు కాదు. డబ్బు... డబ్బు మాత్రమే శాశించగలదు. వెళ్తూ వెళ్తూ ఆమె అన్న తుపాకి తూటాల్లాంటి మరో మాట అతని గుండెని కలచివేసింది.

"కొద్ది రోజుల తరువాత నీ ఆరోగ్యం, నీ అందం చెదరకుండా, నీ శరీరానికేం ఢోకా లేదని డాక్టర్ సర్టిఫికేట్ ఇచ్చిన తరువాత కబురుచెయ్యి. అప్పుడొచ్చి నీ చెయ్యందుకుంటాను."

అప్పుడు తెలిసిందతనికి నిజమైన నిజం! ఆమె ప్రేమ తన మీద కాదు తన అందం మీదా, తన ఆరోగ్యం మీదా అని.

మాధురి వెనుదిరిగి అడుగులో అడుగు వేస్తోన్న కొద్దీ పెరుగుతున్న తమమధ్య దూరం!

నిశ్శబ్దంగా తన ప్రేమ తరలి వెళ్ళిపోవడాన్నే చూస్తున్నాడు. అతని చుట్టూ వేదాంతంలాంటి నిశ్శబ్దం అలుముకుంది. డాక్టర్ తన ఆరోగ్యాన్ని గురించిన చెప్పిన నిజం కన్నా బాధాకరమైన అనుభవం ఇది.

మనిషి తన జీవితంలో గాఢంగా ఏర్పరచుకున్న నిశ్చితాభిప్రాయాలు కూడా కొన్ని సందర్భాల్లో సుడిగాలి లో గడ్డిపోచల్లా కొట్టుకుపోతాయేమో! అనుభవాల తాలూకు తీవ్రత ననుసరించే ఆలోచనలు పదును తేలేది. అది ప్రకృతి సహజం.


చేతితో ఏమీ విసరకపోయినా సముద్రంలో కల్లోలం రేగుతూనే ఉంది. ఇది జరిగి ఇరవైనాలుగ్గంటలు కాక ముందే అభినవ్ జీవితంలో ఒక అద్భుత సంఘ టన జరిగింది.

అది "హిమ" రూపంలో!...

తామంతా కాలేజ్‌లో కలిసే చదువు తున్నారు. అదికాదు విశేషం. అంతకన్నా ముఖ్యమైన విషయం మరోటుంది.

హిమకు అభినవ్ అంటే విపరీతమైన అభిమానం. ఆ తరువాత ఆరాధన పెంచుకుంది. ఆ విషయాన్ని ఆమె తనలో దాచుకునే ప్రయత్నమేమీ చెయ్యకుండా తన ముందు మది పుస్తకాన్ని విప్పింది. అంతా విన్నాక ఒక్కమాటలో కొట్టిపారేశాడు.

"అయాం సారీ హిమా! యూ ఆర్ లేట్. నా మనసిప్పుడు నా దగ్గర లేదు. దాన్ని మాధురికి ఎప్పుడో అర్పించేశాను."




కె. రాధ, కేరాఫ్ శ్రీనివాస్, మల్లారం (పోస్టు), తాడిచెర్ల (మం) - 505 184, కరీంనగర్ జిల్లా.

ఆ సమయంలో ఆమె కళ్ళు చినుకులు రాల్చడాన్ని తను గమనించకపోలేదు. ఐనా వెల్లువలాంటి మాధురి ప్రేమముందు అవి కదిలించలేక గమనించనట్లే ఉండిపోయాడు.

అలాంటిది ఇప్పుడు హిమ తనని కలిసి ఇంకా తన హృదయంలో ఆరిపోనివ్వకుండా దాచుకున్న ప్రేమదీపాన్ని కళ్ళముందు నిలిపి "నీ జీవితాన్ని ఆరిపోనివ్వను మిత్రమా' ' అన్నట్లు చూపుల్తోనే భావాశ్రు వులు వర్షిస్తుంటే...

"హి...మా..." అస్పష్టంగా గొణికాడు అభినవ్.

వెక్కుతూ చెప్తోందామె.

"అభీ! నువ్వు నా ఆరాధకుడివే కాదు. నా సర్వస్వానివి. నీతో కలసి కొన్నేళ్ళు కాదు. కొన్ని క్షణాలు జీవించినా నా జన్మ ధన్యమైనట్లే!..."

"ఓమైగాడ్! మాధురి తనను తిరస్కరించిందన్న సంగతి అప్పుడే విద్యుత్తరంగంలా ఈమె దాకా వ్యాపించిందన్న మాట! రెక్కలు గట్టుకుని కాకిలా వాలింది. ఆడదానికి ఎంత స్వార్థం? అవకాశాన్ని అప్పుడే చేజిక్కించు కోవాలని దూకింది."

మనసులోనే విసుగ్గా అనుకుంటున్నాడు. ఆమె చెప్తూనే ఉంది.

"నీకోసం... కాదు...అభినవ్! నా ప్రాణానికి ప్రాణమైన నా మన్మధుడి కోసం, నా ప్రాణవల్లభుడి కోసం... నా కిడ్నీ ఇస్తాను. నా యావదాస్తినీ ఫణంగా పెట్టి నిన్ను రక్షించు కుంటాను అభీ! ఇది నా స్వార్థమని నువ్వనుకున్నా. చివరికి నువ్వు నాకు దక్కకుండా మరొకరి సొత్తయినా నా కిష్టమే."

అనురాగమా!... నీ అడ్రసెక్కడ? అసలు నీ స్వరూపమెలాంటిది?

ఒకలాంటి నిశ్చేష్టత ఆవరించి నోట మాట కూడా రావటం లేదు అభినవ్‌కి.

డాక్టర్ తన వ్యాధి గురించి చెప్పినప్పుడు ఏడుపు రాలేదు. ప్రేమించిన మనిషి కాదని కాలదన్ని తిరస్కరించి వెళ్ళినప్పుడు కూడా కన్నీరు రాలేదు.

ఇదిగో... ఇప్పుడు... ఇప్పుడు తనకు తెలీకుండానే ఎదలోయలు కదిలి దుఃఖం పొంగి పొర్లటానికి సంసిద్ధమౌతోంది.

నిభాయించుకోలేక ఆమె ఒడిలో తలదాచుకుని చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చేశాడు.

ఎవరో మహానుభావులు చెప్పినట్లు "తను ప్రేమించే వారికంటే తనను ప్రేమించేవారు ఎంతో ఆత్మీయులు" అన్నది పచ్చి నిజం!

ప్రేమగా పసివాడిగా అతనని ఎదకి హత్తుకుని ఉండి పోయింది హిమ.

ప్రేమపట్ల తను పెంచుకున్న నమ్మకాన్ని ఒకస్త్రీ మొదలంటా పెరికేసి మోడుగా మారిస్తే మరో స్త్రీ మళ్ళీ పాదుచేసి ప్రేమ అనే నీరుపోసి తను తిరస్కరించినా చిగురింపజేయటానికి ప్రయత్నిస్తోంది.

అది చాలు తనలో కొడిగట్టుపోతున్న ధైర్యదీపం ఆరిపోకుండా ఉండటానికి... అభినవ్‌ని వెంటబెట్టుకుని అభిసారికలా కదలింది హిమ డాక్టర్ దగ్గరికి.

ఆమె ఆసరాతో, అండతో ధైర్యంగా ముందుకు నడుస్తోన్నాడు అభినవ్!

దూరం నుండి ఓ పాట గాలిలో కలసి వచ్చి కర్ణపుటాలకు... సాగుతోంది.

నేనున్నానని...నిండుగ పలికే... తోడొక రుండిన అదే భాగ్యమూ... అదే సౌఖ్యమూ..."


శ్రీమతి ఎన్. హరిప్రియ
శ్రీరామా రైస్ మిల్,
స్టువార్ట్ పురం, బాపట్ల తాలూకా,
గుంటూరుజిల్లా - 522 317.

## మాధురి పోలిక



దూరదర్శన్ కార్యక్రమాల్లో అందర్నీ ఆకట్టుకునేది 'చిత్రహార్'. ఈ ప్రోగ్రామ్ నిర్వహించే 'వైదేహి'ని చూస్తే మాధురీ దీక్షిత్ లాగా అనిపిస్తుంది కదూ! అసలు 'చిత్రహార్'ని ముందుగా నిర్వహించమని మాధురీ దీక్షిత్‌నే అడిగాట్ట సుభాష్ ఘయ్. కానీ మాధురీ దీక్షిత్ ఒప్పుకోలేదట. అందుకే దాదాపు ఆమె పోలికలే ఉన్న వైదేహిని కావాలని ఎన్నుకున్నాట్ట సుభాష్. ప్రముఖ చిత్ర నిర్మాత- దర్శకుడు అయిన సుభాష్ ఘయ్ 'చిత్రహార్' కార్యక్రమ నిర్మాతల్లో కీలకమైన వాడు మరి!

-మౌర్య.




కె. రాధ, కేరాఫ్ శ్రీనివాస్, మల్లారం (పోస్ట్), తాడిచెర్ల (మం) - 505 184, కరీంనగర్ జిల్లా.